
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 25 । జూన్ । 2025



సోమశిలలో 34.477 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 34.477 టీఎంసీలు ఉన్నాయి. 461 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1,425 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,00,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,068
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,340
నవర (8 గ్రాములు)	రూ.74,720

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /28.8

జిల్లాలో బుధవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం నుంచి వర్ష సూచన. మంగళవారం గాలిలో తేమ 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పురావస్తుశాఖ అధికారుల పరిశీలన



స్థానికులతో కలిసి రంగనాయకులగుడిని పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: ఉదయగిరిలోని రాయల కాలం నాటి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పలు కట్టడాలను మంగళవారం పురావస్తు, ఆర్కియాలజీ శాఖల అధికారులు పరిశీలించారు. శిథిలమవుతున్న పలు కట్టడాలకు ఏ విధంగా రక్షణ కల్పించాలనే అంశంపై స్థానికులతో చర్చించారు. ప్రాముఖ్యత ఉన్న దేవాలయాలను పురావస్తు శాఖ నుంచి దేవదాయశాఖకు మార్పు చేయాలని కోరారు. ఇందుకు అధికారులు స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఆర్కియాలజీ సూపరింటెండెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్ భాయి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.సాంబశివకుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, ఒంగోలు పురావస్తు శాఖ అధికారి యశ్వంత్‌రెడ్డి, తదితరులున్నారు.

కూలీల సంఖ్య పెంచండి



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగా భవాని

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను రోజుకు లక్షకు తగ్గకుండా పెంచాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. మంగళవారం డ్వామా కార్యాలయం ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులను గుర్తించి కూలీలకు పనిదినాలు కల్పించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి నిధులతో గతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాలు చేపట్టారన్నారు. అందుకు సంబంధించి పాత బకాయిలు రూ.50 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. మిగిలిన బిల్లులు త్వరలో చెల్లిస్తామని తెలిపారు. పంట కుంటల లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు.

నేడు మంత్రి సంధ్యారాణి పర్యటన

నెల్లూరు రూరల్: రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం నెల్లూరులో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నెల్లూరుకు చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మహిళా,శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 2 గంటల నుంచి 2:30 వరకు అధికారులో మాట్లాడుతారు. 2:30 గంటలకు విలేకరుల సమావేశం అనంతరం తిరిగి రోడ్డు మార్గంలో విజయవాడకు వెళ్తారని పేర్కొన్నారు.

సాగునీటి కాలువల ఆక్రమణల పరిశీలన

- లోకాయుక్త ఆదేశాలతో



ఆత్మకూరు చెరువు వద్ద కాలువల ఆక్రమణ స్థితిపై మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు చెరువు పరిధిలో పలు సాగునీటి కాలువల ఆక్రమణలను మంగళవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ వరప్రసాద్, తిరుపతి, నెల్లూరు ఎస్‌ఈ దేశ్‌నాయక్, ఆత్మకూరు ఈఈ ఎం.రవి, ఏఈ రవికుమార్‌రెడ్డి, తహసీల్దారు పద్మజాకుమారి తదితరుల బృందం పరిశీలించింది. సాగునీటి కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. లోకాయుక్త ఆదేశాల మేరకు పట్టణంలోని స్పార్క్ సిటీ ప్రాంతం నుంచి చెరువు వరకు ఉన్న కాలువలను, అలుగులను, సోమశిల రోడ్డు మలుపు వద్ద కాలువను ఆక్రమించి నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీరు వరప్రసాద్ మాట్లాడుతూ చెరువు నుంచి పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలు పలుచోట్ల ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామన్నారు. దీంతో పైర్లకు సాగు నీరందక రైతులు పడుతున్న ఇబ్బందులపై పూర్తి వివరాలను లోకాయుక్తకు నివేదిక అందజేస్తామన్నారు. వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది కొండయ్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పెన్నాలో పర్యావరణం

పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో నదులు, కాలువల్లో ఇసుక తవ్వకాలు చేపట్టొద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నారు. అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపైనే తిరుగుబాటు చేసే స్థాయికి టీడీపీ నేతలు బరితెగించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇసుక తవ్వకోమని 'మా చంద్రబాబు, మా ఆనం' చెప్పారంటూ మీరెవరు ఆపేదానికి అని టీడీపీ జెండాలు పట్టుకుని పోలీసులను, రెవెన్యూ అధికారులను తరిమి కొట్టడం చూస్తే పెన్నానదిలో పర్యావ'రణం' చేస్తున్నారు.

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- యథేచ్ఛగా రీచ్‌ల నిర్వహణ, ఇసుక తరలింపు
- అప్పారావుపాళెంలో కొనసాగుతున్న రీచ్



ఆత్మకూరు: పెన్నానదిలో ఇసుక రీచ్‌లను జూన్ 1వ తేదీ నుంచి రెండు నెలల పాటు మూసివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. అయినా ఎక్కడా ఈ ఆదేశాలు అమలు చేయడం లేదు. మిగతా చోట్ల పగలు ఇసుక తవ్వకాలు ఆపేసి రాత్రి పూట చాటుమాటుగా చేపడుతుంటే.. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం వద్ద పెన్నానది ఇసుక రీచ్ రాత్రింబవళ్లు విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రీచ్‌లను మూసివేయకపోవడంతో 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆర్డీఓ బి.పావని ఆదేశాలతో తహసీల్దారు రీచ్‌ని మూయించి వేశారు. కేవలం రెండు రోజులు మాత్రమే మూసేసిన ఈ రీచ్‌లో శనివారం నుంచి యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా ఆత్మకూరు, పొదలకూరు, చేజర్ల మండలాలకు తరలిస్తున్నారు. అధికారుల ఆదేశాలతో ఓ వీఆర్‌ఓను అక్కడ కాపలా ఉంచి రీచ్‌లోకి వెళ్లకుండా తాళం సైతం వేశారు. అయితే టీడీపీ నాయకుల ప్రమేయంతో స్థానికులు తాళాలు పగులగొట్టి వీఆర్‌ఓను అక్కడి నుంచి పంపివేసి దౌర్జన్యంగా ఇసుకను తరలిస్తున్నారు. రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా జేసీబీతో లోతుగా గాడి తీయాలని అధికారులు పంపగా స్థానికులు అడ్డుకొని రీచ్‌లోకి దారికి గండి కొట్టకుండా ఆ వాహనాన్ని వెనక్కి పంపివేశారు.

విలేకరులకు బెదిరింపులు

ప్రభుత్వం మాదే.. ఇసుక రీచ్‌లో పెత్తనమంతా మాదేనంటూ స్థానిక టీడీపీ నేతలు కొందరు యువకులను చేరదీసి ఇసుక రీచ్‌లో హవా కొనసాగిస్తున్నారు. గ్రామంలో యంత్రాల ద్వారా ఇసుక లోడ్ చేయడం లేదని కేవలం మనుషులే ఉపాధి కోసం ఇసుక లోడ్ చేస్తున్నారని చెబుతూ, తమకు ప్రత్యేకమైన అనుమతి ఉందని పేర్కొనడం గమనార్హం. ఈ విషయంలో ఎవరు జోక్యం చేసుకున్నా తీవ్ర పరిణామాలు ఉంటాయని విలేకరులను సైతం ఇష్టారాజ్యంగా వార్తలు రాస్తే సహించేది లేదని ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారు. స్థానిక టీడీపీ నేతల అండ చూసుకుని యువకులు సైతం కథనాలు రాసిన వారిపై కేసు నమోదు చేయాలని ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. గ్రామంలోకి వస్తే విలేకరుల అంతు చూస్తామని వారు బాహాటంగానే అంటున్నారంటే అక్కడి పరిస్థితి అర్థమవుతుంది. శనివారం నుంచి పూర్తి స్థాయిలో ఇసుకను తరలిస్తున్న ఈ రీచ్‌లో సుమారు 50 నుంచి 70కిపైగా ట్రాక్టర్లు లోడ్ చేసుకొని యథేచ్ఛగా సాగుతున్నాయి.



రీచ్‌లోకి లోడ్‌కు వెళ్లే ట్రాక్టర్‌కు చీటి ఇస్తున్న మహిళ

ఉపాధి పనులు వద్దని..

ఇసుక లోడింగ్ ద్వారా ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేందుకు అధికారులను మూడు రోజుల క్రితం గ్రామానికి పంపించారు. అందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి పనులను కల్పించాలని ఉపాధి కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. దీంతో ఉపాధి హామీ పథకం సిబ్బంది గ్రామానికి వెళ్లారు. అయితే అక్కడ ఓ వర్గం ఉపాధి పనులు మాకు వద్దని ఇన్నాళ్లు గ్రామానికి ఎందుకు రాలేదని ఇప్పుడెందుకు వచ్చారని వారిని దుర్భాషలాడి తరిమేశారు. గతంలోనూ ఉపాధి పనులు చేసుకోవాలని తాము సూచించామని, ఇసుక రీచ్ ఉందని ఎప్పుడు ఈ పనులు ఉంటాయని, ఉపాధి పనులు అవసరం లేదని గ్రామస్తులు చెప్పడాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది గుర్తు చేశారు. కాలనీలోని కొందరు టీడీపీ నాయకుల అండతో ఇసుక రీచ్‌నే పరమావధిగా చేసుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు.

40 బ్యాచ్‌లతో ఇసుక లోడింగ్



అప్పారావుపాళెం ఇసుక రీచ్ నుంచి లోడ్ చేసుకొని మెయిన్ రోడ్డులోకి వస్తున్న ట్రాక్టరు

ఇక్కడి ఇసుక రీచ్‌లో ఒక్కో బ్యాచ్‌కు 8 నుంచి 10 మంది చొప్పున లోడర్లు ఉన్నారు. మొత్తం 40 బ్యాచ్‌లు ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఈ ఇసుక లోడ్ చేసే బ్యాచ్‌ల వద్ద స్థానిక టీడీపీ నాయకుల ఆదేశాలతో ఓ కుటుంబం ఒక్కో బ్యాచ్ వద్ద రూ.50 వసూలు చేస్తున్నారు. ఇందుకు ట్రాక్టర్లకు చీటీలు ఇచ్చి ఆ మేరకు బ్యాచ్‌లకు లోడింగ్ పనులు కల్పిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లా వ్యాప్తంగా ఇసుక రీచ్‌లను ప్రభుత్వ ఆదేశాలతో మూసి వేసినా అప్పారావుపాళెంలో ఇసుక రీచ్ రెండు రోజుల పాటు నిలిపివేసినా తిరిగి కొనసాగించడంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. నిత్యం పదుల కొద్ది వాహనాలకు ఇసుకను లోడ్ చేసి రెండు, మూడు మండలాలకు తరలిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పద్మజాకుమారిని సంప్రదించగా గత వారంలో ఆర్డీఓ ఆదేశాల మేరకు రీచ్‌ను క్లోజ్ చేయించాం. అక్కడ వీఆర్‌ఓను కాపలా ఉంచాం. రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా లోతుగా గాడి తీయిస్తాం. ఈ విషయాలను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని తెలిపారు.

క్రస్ట్‌గేట్ల మరమ్మతుల్లో తీవ్ర జాప్యం



జలాశయం వద్ద ఉన్న నూతన రోప్‌లు

సోమశిల: జిల్లా జలనిధి సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్ల మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జలాశయ 11, 12 క్రస్ట్ గేట్ల రోప్‌లు పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో వాటికి మరమ్మతుల కోసం దాదాపు 20 రోజుల క్రితం నూతన రోప్‌లను ప్రాజెక్టు వద్దకు చేర్చారు. అయితే వాటిని అక్కడ నిరుపయోగంగా పడేశారు. ఈ క్రమంలో 4, 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని డెల్టాకు విడుదల చేయడంతో ఆప్రాన్ మీదుగా వాహనాలు అనుమతించకపోవడంతో సోమశిల, రాజుపాళెం, కమ్మవారిపల్లి, కలువాయి, పీకేపాడు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సుదూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సంబంధిత జలాశయం అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే క్రస్ట్ గేట్లకు కొత్త రోప్‌లు ఏర్పాటు చేసే పనులు చేపట్టాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఐడీ కేసులో కాకాణికి రెండు రోజుల పోలీస్ కస్టడీ

నెల్లూరు (లీగల్): సర్వేపల్లి రిజర్వాయర్ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించారని ఆరోపిస్తూ మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై సీఐడీ పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం రెండు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ నెల్లూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్.శారదారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని బుధవారం ఉదయం 8 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి పోలీస్ కస్టడీకి తీసుకోవాలని బాపట్ల డీఎస్పీ, సిట్ అధికారిని న్యాయమూర్తి ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాకాణిని న్యాయవాది సమక్షంలో విచారించాలన్నారు. గురువారం సాయంత్రం 5 గంటల తర్వాత ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించకూడదని, సూర్యాస్తమయం తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో విచారించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న కాకాణిని విచారించడానికి ఏడు రోజుల పోలీసు కస్టడీ కోరుతూ బాపట్ల డీఎస్పీ, సిట్ అధికారి నెల్లూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాకాణిని వ్యక్తిగతంగా విచారించినప్పుడే సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ తవ్వకాల్లో ఎంత మేర ప్రభుత్వానికి నష్టం జరిగిందనే విషయం తెలుస్తుందని పోలీసులు తరఫున ఏపీపీ తమ వాదనలు వినిపించారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది రామిరెడ్డి రోజారెడ్డి వాదనలు వినిపిస్తూ పోలీసులు ఆరోపించినట్లుగా ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ కేసును నమోదు చేశారని కౌంటర్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కాకాణిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు చెప్పండి

- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో తాను పాదయాత్ర చేయడం ముఖ్యం కాదని, ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి ఆమె మంగళవారం నగరానికి విచ్చేశారు. నగరంలోని పీఎస్‌ఆర్ కల్యాణ మండపం నుంచి ర్యాలీగా బయలుదేరిన ఆమె గాంధీబొమ్మ సెంటర్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరాభవన్‌లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పలువురు నాయకులు ఆమెను రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కోరారు. దీంతో ఆమె తన పాదయాత్ర ముఖ్యం కాదని, రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాల అమల్లో ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. పక్కనే ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, రానున్న కాలంలో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రజల నమ్మకాన్ని సంపాదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, ఓబీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్, కమాలాకర్, డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కిరణ్ కుమార్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, డాక్టర్ యశోధర, సంజయ్, నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నా కలుషితంపై నేడు కలెక్టర్ విచారణ

- ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన జొన్నవాడ వాసి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జొన్నవాడ కామాక్షితాయి ఆలయ పరిసరాల్లోని పవిత్ర పినాకిని నది మురుగు జలాలతో కలుషితం కావడంపై కలెక్టర్ ఆనంద్ బుధవారం విచారణ చేపట్టనున్నారు. పెన్నానది కలుషితమవుతోందని జొన్నవాడకు చెందిన సింగిరి మధు అనే వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు గత నెలలో ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా జొన్నవాడలోని మలికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పెన్నానదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారని, అలాంటి పవిత్ర తీరంలో గ్రామానికి చెందిన మురుగునీరు నదిలోకి వదిలేయడంతో కలుషితమవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌జీటీ చెన్నైలోని సౌత్‌జోన్ బెంచ్‌కు బదిలీ చేసింది. ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్‌కు చెందిన జస్టిస్ అరుణ్‌కుమార్ త్యాగి, డాక్టర్ అఫ్రోజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జలవనరుల, పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల విభాగం కార్యదర్శులు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శితో పాటు కలెక్టర్‌ను బాధ్యులుగా చేస్తూ గత నెల 29న ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు కలెక్టర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బుధవారం జొన్నవాడ ఆలయ పరిసరాల్లో విచారణ చేపట్టనున్నారు. నదీ జలాలు కాలుష్యం, చెత్త తదితర వస్తువులు నదిలో కలవడంపై సమగ్ర విచారణ జరిపి నివేదికను ఎన్‌జీటి చెన్నై బెంచ్‌కు అందించనున్నారు. ఆగస్టు 8న ఎన్‌జీటీ బాధ్యులుగా గుర్తించిన సభ్యులందరూ బెంచ్ ముందు హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంది.



జొన్నవాడ వద్ద పెన్నానదిలో కలుస్తున్న మురుగునీరు పారే ప్రధాన కాలువ



జొన్నవాడ వద్ద పెన్నానదిలో పేరుకుపోతున్న చెత్త చెదారాలు

డీసీపల్లిలో 584 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో మంగళవారం 584 పొగాకు బేళ్లను విక్రయించినట్లు నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1,007 బేళ్లు రాగా వాటిలో 584 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలియజేశారు. వేలంలో 73,783.2 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,56,49,598ల వ్యాపారం జరిగింది. గరిష్ఠ ధర కిలో ఒక్కంటికి రూ.280 కాగా కనిష్ఠ ధర రూ.160 లభించింది. మొత్తం మీద సగటు ధర రూ.212.10గా నమోదైంది. వేలంలో తొమ్మిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 509 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 394 పొగాకు బేళ్ల కొనుగోలు జరిగింది. వివిధ కారణాలతో 115 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160 పలుకగా, సరా సరి రూ.242.91 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

15.5 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు తెలుపుతున్న రైల్వే పోలీసులు

కావలి (జలదంకి): నెల్లూరు, కావలి, గూడూరు రైల్వేస్టేషన్ల పరిధిలో సోమవారం మధ్యాహ్నం చేపట్టిన తనిఖీల్లో 15.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ మంగళవారం తెలిపారు. తమిళనాడు తిరుచ్చిరాపల్లికి చెందిన తవామణి, బిహార్‌కు చెందిన సూరజ్‌కుమార్ గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో గంజాయి రవాణాదారులను పట్టుకున్న నెల్లూరు రైల్వే సీఐ హరిచందన, నెల్లూరు డీఎస్‌ఆర్‌పీ మురళీధర్, కావలి జీఆర్‌పీ సబ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవిని అభినందించారు.

గిరిజన బాలికకు పరామర్శ



బాలికను పరామర్శిస్తున్న శంకర్‌నాయక్

నెల్లూరు(అర్బన్): చిత్రహింసలకు గురై శరీరం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ఇందుకూరుపేట మండలం కుడితిపాళేనికి చెందిన గిరిజన బాలిక చెంచమ్మను మంగళవారం నగరంలోని అపోలో ఆస్పత్రిలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు పడిత్యా శంకర్‌నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధితురాలికి అండగా నిలిచి రక్షణ కల్పించడంతో పాటు ఆ గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇస్లావత్ హనుమంతనాయక్, దుర్గానాయక్, ప్రసన్నకుమార్, యాటగిరి సునీల్, శివ పాల్గొన్నారు.

ఏపీ పీజీఈసెట్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): ఎంటెక్, ఎంఫాంల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ పీజీ ఈసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు జిల్లాలో 483 మంది దరఖాస్తు చేసుకోగా 403 మంది హాజరయ్యారు. వీరిలో 382 మంది విద్యార్థులు అర్హత సాధించడంతో 94.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బయోటెక్నాలజీ విభాగంలో పడారుపల్లికి చెందిన మారం వీరరాఘవరెడ్డి 57 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పొదలకూరు మండలం మహమ్మదాపురానికి చెందిన జమ్మల మాలకొండయ్య 73 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు, నవాబుపేటకు చెందిన కొత్తకోట సాయిభాను 3వ ర్యాంకు, ఎలక్ట్రికల్ ఇంజినీర్ విభాగంలో ఆత్మకూరుకు చెందిన కరటంపాటి వెంకటతేజ 63 మార్కులతో 7వ ర్యాంకు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన కోకటి పవన్ కళ్యాణ్ 81 మార్కులతో 6వ ర్యాంకు సాధించారు.

క్లుప్తంగా

బంగారం, నగదు చోరీ

జలదంకి: మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం గ్రామంలో మోర్ల శీనయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. శీనయ్య – రమణమ్మ దంపతులు సోమవారం ఉదయం అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. అయితే అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారింటి తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని పది సవర్ల నగలు, రూ.90 వేల నగదు అపహరించారు. మంగళవారం ఉదయం పనిమనిషి ఇంటి వద్ద ఊడ్చేందుకు వచ్చింది. తలుపులు తీసి ఉండటంతో శీనయ్య కుమార్తె, అల్లుడికి విషయం చెప్పింది. వారు జలదంకి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లతీఫున్నీసా ఘటనా స్థలానికి చేరు కుని పరిశీలించారు. నెల్లూరు నుంచి క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): నడుము నొప్పి భరించలేక బాత్‌రూమ్‌ను శుభ్రం చేసే రసాయనం తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన ఎ.సురేష్, సుమతి దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. ప్రస్తుతం సురేష్ తన భార్యాపిల్లలు, తల్లి లక్ష్మమ్మ (65)తో కలిసి నెల్లూరు చైతన్యపురి కాలనీలోని ఓ ఇంట్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆ కుటుంబం అదే ఆవరణలోని అవుట్ హౌస్‌లో నివాసముంటోంది. లక్ష్మమ్మ కొంతకాలంగా తీవ్ర నడుము నొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నా నయం కాలేదు. దీంతో ఆమె తీవ్రంగా బాధపడుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి లక్ష్మమ్మ బాత్‌రూమ్‌కు వెళ్లింది. అక్కడ రసాయనం తాగింది. కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి నొప్పులు భరించలేక రసాయనం తాగినట్లు కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. సురేష్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కండలేరులో 34.688 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 34.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,500, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉచిత ప్రవేశాలకు గండి

విద్యాహక్కు చట్టానికి తూట్లు

- పేరుకే ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు
- ఫీజులు చెల్లించకుంటే పిల్లలు రావొద్దని ఆదేశాలు
- సాక్షాత్తు మంత్రి నారాయణ స్కూల్లోనే ఘటన
- ఆ స్కూల్‌పై చర్యలు తీసుకునేందుకు అధికారుల వెనుకంజ
- స్కూల్ నిర్వాకంపై గ్రీవెన్స్‌లో నాలుగుసార్లు ఫిర్యాదు



నెల్లూరు(టౌన్): ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్టీఈ కింద 25 శాతం మంది పేద విద్యార్థులకు ఒకటో తరగతి ఉచిత ప్రవేశం కల్పించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిని గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేసిన దాఖలాల్లేవు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో 2022 – 23 విద్యా సంవత్సరం నుంచి ఉచిత ప్రవేశాల అవకాశం దక్కింది. పేద విద్యార్థులకు సొంత గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి వరకు ఉచితంగా విద్యను అందించాల్సి ఉంది. ఒక్కో విద్యార్థి గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్ అయితే రూ.6,500, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.8,500 ప్రభుత్వమే చెల్లిస్తుంది. గత ప్రభుత్వంలో ఈ ప్రక్రియ ఇబ్బందుల్లేకుండా జరిగింది.

అడ్మిషన్లు ఇవ్వం

కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు లేనట్లే అనే ప్రచారం జరుగుతోంది. రెండేళ్లుగా ఉచిత ప్రవేశాలకు ఫీజులను చెల్లించలేదు. దీంతో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గత విద్యా సంవత్సరం ఉచిత ప్రవేశాలు పొందిన పిల్లలను పాత ఫీజులు చెల్లిస్తేనే చేరండని లేకుంటే అడ్మిషన్లు ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నాయి. పైగా బుక్స్, యూనిఫాం, అడ్మిషన్ తదితర ఫీజుల కింద రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకూ వసూలు చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫాం కూడా యాజమాన్యాలే ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఉచిత ప్రవేశం పొందిన విద్యార్థుల్లో సగం మందికి పైగానే ఆయా పాఠశాలల్లో లేదా ఇతర వాటిల్లో సొంత ఫీజులు చెల్లించి చదువుకుంటున్న పరిస్థితి ఉంది. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖాధికారుల వరకూ అందరికీ తెలిసినా జిల్లాలో మంత్రి నారాయణకు చెందిన పాఠశాలలు ఎక్కువగా ఉండటంతో మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలున్నాయి. సాక్షాత్తు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా ప్రవేశాలు

సంవత్సరం	విద్యార్థులు
2022 - 23	48
2023 - 24	598
2024 - 25	902
2025 - 26	688

శిక్షకు అర్హులు



విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలి. ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలే గానీ పిల్లల్ని ఇబ్బంది పెట్టకూడదు. ఉచిత సీట్ల విషయంలో సుప్రీం కోర్టు, పార్లమెంట్ కూడా ఆదేశాలు జారీ చేశాయి. ఫీజు చెల్లించలేదని విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోకుంటే గుర్తింపు రద్దు, జైలు శిక్షకు అర్హులని చెప్పింది. – నరహరి, రాష్ట్రాధ్యక్షుడు, ది పేరెంట్స్ అసోసియేషన్

ఇబ్బంది పెట్టడం వాస్తవమే



విద్యాహక్కు చట్టం ద్వారా ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించిన విద్యార్థుల విషయంలో ఇబ్బందులున్న మాట వాస్తవమే. ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పెండింగ్ ఫీజుల చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తాం. – బాలాజీరావు, డీఈఓ.

చర్యలు లేకపోవడంతో...

చింతారెడ్డిపాళెం పంచాయతీ సాత్‌రాజుపాళేనికి చెందిన ఎంబీటీ వినయ్‌కుమార్ కుమారుడు యువ యశ్వంత్‌కు 2024 – 25 విద్యా సంవత్సరంలో నెల్లూరులోని రామలింగాపురంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం లభించింది. అయితే సదరు యాజమాన్యం ఆ ఏడాది బుక్స్, యూనిఫాం, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ పేరుతో రూ.11 వేలు తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం రెండో తరగతిలో చేరాలంటే నిబంధనలు పెట్టింది. 1వ తరగతి ఫీజు కింద రూ.13 వేలు, అలాగే రెండో తరగతికి బుక్స్, యూనిఫాంకు రూ.10 వేలు, అడ్మిషన్ ఫీజు కింద రూ.3,800 కలిపి మొత్తం రూ.26,800లు చెల్లిస్తేనే స్కూల్లో ఉంచుతామని ఖరాఖండిగా చెప్పింది. దీంతో చేసేదేమి లేక పాఠశాల ప్రారంభమైనా ఇంటి దగ్గర ఉన్నాడు. ఈ విషయంపై యశ్వంత్ తండ్రి వినయ్‌కుమార్ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగుసార్లు ఫిర్యాదు చేశారు. ఇంకా మరో ముగ్గురు పిల్లల తల్లిదండ్రులు కూడా అదే నారాయణ పాఠశాల యాజమాన్యంపై వినతిపత్రం ఇచ్చారు. అయినా నేటికీ చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించి చట్టాలను అమలు చేయాల్సిన నారాయణ వాటిని తుంగలో తొక్కి పైసా వసూళ్లే పరమావధిగా వ్యవహరించడమేమిటని విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారాయణ స్కూల్స్ యాజమాన్య దారిలోనే మిగిలిన ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి.

పోలవరం నిర్వాసితులకు మద్దతుగా ధర్నా

నెల్లూరు(అర్బన్): పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాస సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్కడి సర్పంచ్ వేట్ల విజయ చేస్తున్న నిరసన దీక్షకు మద్దతుగా రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు నెల్లూరు గాంధీబొమ్మ వద్ద నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా జరిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ పేరుతో 5 లక్షల మంది ప్రజలను గ్రామాల నుంచి ప్రభుత్వం ఖాళీ చేయించిందన్నారు. వారి పునరావాసం గురించి పట్టించుకోకుండా గాలికొదిలేసిందన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య మాట్లాడుతూ ఆదివాసులకు జీవించే హక్కు, నివసించే హక్కులకు భంగం కలిగించరాదన్నారు. నేషనల్ పార్క్ పేరుతో ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించడం దుర్మార్గమన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కింద వందల గ్రామాలు ముంపునకు గురై లక్షల మంది నిర్వాసితులవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తి కోసం బనకచర్ల ప్రాజెక్ట్‌ను ముందుకు తెచ్చిందని విమర్శించారు. అనంతరం డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) జిల్లా నాయకుడు లక్ష్మీరెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కొండమ్మ, నాయకులు శ్యామల, యానాదయ్య, సండే మార్కెట్ యూనియన్ నాయకుడు శరవణన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు


కుటుంబ కలహాలతో..

- వివాహిత బలవన్మరణం

ఆత్మకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు హిల్‌రోడ్డులో మంగళవారం జరిగింది. ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బి.సాయిప్రసాద్‌ల కథనం మేరకు.. గొట్ల హజరత్తయ్య, ప్రణవి (24) దంపతులకు ఇద్దరు సంతానం. మరో మహిళతో హజరత్తయ్య సన్నిహితంగా ఉంటూ భార్యను నిర్లక్ష్యం చేశాడు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణవి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్సైలు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8



పంట కాలువలో పడి..

- యువకుడి మృతి

తోటపల్లిగూడూరు: పంట కాలువలో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తపాళెం గ్రామంలో జరిగింది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు గ్రామానికి చెందిన పాటి అశోక్ (29) మోటార్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. చెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా కొత్తపాళెంలోని తన చెల్లెలు ఈదూరు అమూల్య ఇంటికి రెండు రోజుల క్రితం అశోక్ వచ్చాడు. సోమవారం రాత్రి ఆలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన అనంతరం అశోక్ బహిర్భూమి కోసం స్థానిక పంట కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ గుండెపోటు రావడంతో పంట కాలువలో పడి ఊపిరాడక మృతిచెందినట్లు చెబుతున్నారు. మంగళవారం ఉదయం గుర్తించిన స్థానికులు జరిగిన విషయం అశోక్ సోదరి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి శవ పంచనామా నిర్వహించారు. అనంతరం శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.



అశోక్ మృతదేహం

మహిళలపై అఘాయిత్యాలు సహించం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

నెల్లూరు(పొగతోట): మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారు ఎటువంటి వారైనా, ఏ పార్టీకి చెందిన వ్యక్తులైనా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ హెచ్చరించారు. మంగళవారం ఆమె నెల్లూరుకు వచ్చారు. పలువురు బాధితులను పరామర్శించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందుకూరుపేట మండలంలో సెల్‌ఫోన్ చోరీ అనుమానంతో ఓ బాలికను చిత్రహింసలకు గురిచేసిన ఐదుగురిలో నలుగురిని గుర్తించి అరెస్ట్ చేశారన్నారు. కనుపర్తిపాడు ఘటనకు సంబంధించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మహిళలను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, ఇందుకూరుపేట సీడీపీఓ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శైలజ

బీసీ సంక్షేమ హాస్టళ్లు పెంచాం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లను పెంచామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. దుత్తలూరులో హాస్టల్ మూసివేతపై మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. దుత్తలూరు, వరికుంటపాడుల్లో హాస్టల్ భవనాలు పిల్లలు ఉండేందుకు అనుకూలంగా లేవని, అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండటంతో తాత్కాలికంగా ఆపేశామన్నారు. ప్రైవేట్ భవనాలను వెతుకుతున్నామని, దొరికిన వెంటనే హాస్టళ్లను పునఃప్రారంభిస్తామన్నారు. అలా కానీ పక్షంలో విద్యార్థులకు అనువైన చోట్ల ఈ ఏడాది చదువుకునే అవకాశం కల్పిస్తామన్నారు. గతేడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో 14 హాస్టళ్లను మూసివేశామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఆత్మకూరు, సంగం, బుచ్చి, అక్కంపేట, వింజమూరు, కావలి, ఉదయగిరిలో ప్రీ మెట్రిక్ హాస్టళ్లను మళ్లీ ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 230 మంది విద్యార్థులు కొత్తగా చేరారని, జూలై 15వ తేదీ వరకు అడ్మిషన్లు ఉంటాయన్నారు.



మాట్లాడుతున్న వెంకటలక్ష్మమ్మ

తనువు చాలించి.. కన్నీళ్లు మిగిల్చి..

ఒంటరితనం వేధించడంతో ఒకరు, వివిధ కారణాలతో మరొకరు మద్యానికి బానిసయ్యారు. ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు నెల్లూరు రూరల్ మండలంలో జరిగాయి. ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

- వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రూరల్ మండలంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడుకు చెందిన వి.మణికంఠ (20) పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి తల్లిదండ్రులు లేరు. ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఎవరూ లేకపోవడం, అప్పుల పాలుకావడంతో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమీప బంధువు వెళ్లి చూసి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అల్లీపురంలో..

అల్లీపురంలోని టిడ్కో ఇంట్లో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కొండాపురం మండలంలోని వరికుంట గ్రామానికి చెందిన దార్ల వెంకటేష్ (34)కు కొన్నినెలల క్రితం వివాహమైంది. భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వెంకటేష్ తల్లిదండ్రులతో ఉంటూ వ్యసనాలకు బానిసయ్యాడు. స్థానికంగా గొడవలకు వెళ్తుండేవాడు. రెండో పెళ్లి కోసం కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చాడు. నెల్లూరు నగరంలోని బంధువుల ఇంట్లో ఉంటూ బేల్దారి పనులకు వెళ్లాలని తల్లిదండ్రులు నచ్చజెప్పి పంపారు. ఈ క్రమంలో బంధువులు తమకు అల్లీపురంలో టిడ్కో ఇల్లు ఉందని అక్కడికి వెళ్లి ఉండాలని అతడిని పంపారు. కొంత కాలంగా అక్కడే ఉంటున్న వెంకటేష్ భార్య వదిలేయడం, ఇంట్లో వాళ్లు రెండో పెళ్లి చేయకపోవడంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బంధువులు అతడికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో టిడ్కో ఇంటికి వెళ్లారు. తలుపులు తట్టినా తెరవకపోవడంతో కిటికీలో నుంచి చూశారు. వెంకటేష్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే బంధువులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి తలుపులు పగులకొట్టి మృతదేహాన్ని దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటేష్ మృతదేహం